క్లుప్తంగా

25న క్రిస్మస్ వేడుకలు

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్‌లో ఈనెల 25న క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు విక్టరీ ఫాస్టర్ అసోసియేషన్ నాయకులు నేహెమియ్యా తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రాథోడ్ రమేశ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నెలనెలా వేతనాలు చెల్లించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో దినసరి ఉద్యోగులకు నెలనెలా వేతనాలు చెల్లించాలని తెలంగాణ దినసరి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు బాపురావు, ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజన్నలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. సరిగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పిల్లల చదువులు, ఆసుప్రతులకు వెళ్లాలన్న కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు.

ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయండి

ఇచోడ: సీపీఐ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 26 వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల కార్మిక, కర్షకుల కోసం సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిల్క దేవిదాస్, ఉస్మాన్ మహేష్, లక్ష్మణ్, లస్మన్న వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఒరిజినల్ గుర్తింపు కార్డు ఉంటేనే ఉచిత ప్రయాణం

ఆదిలాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందాలంటే మహిళలు ఒరిజినల్ గుర్తింపు కార్డు కండక్టర్‌కు చూపించాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ గుర్తింపు కార్డులు ఉంటేనే మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. జిరాక్స్ ప్రతులు, మొబైల్ ఫోన్లో గుర్తింపు కార్డులను చూపించడానికి అనుమతి లేదన్నారు. మహిళా ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి కండక్టర్‌తో సహకరించాలని కోరారు.

జరిమానా

ఆదిలాబాద్: బస్టాండ్ లోని టాయిలెట్ నిర్వాహకుడు ప్రయాణికుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని స్టేషన్ మేనేజర్ సదరు నిర్వాహకునికి రూ. 200 జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా వసూలు చేస్తున్నాడని ప్రయాణికుడు బి.వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, విచారణ చేపట్టి ఫైన్ వేసినట్లు స్టేషన్ మేనేజర్ కృష్ణ తెలిపారు.

'ఉద్యోగులకు మహాలక్ష్మి పథకం వర్తింపజేయొద్దు'

ఇచ్చోడ: ప్రభుత్వం మహిళ ఉద్యోగులకు మహాలక్ష్మి పథకాన్ని వర్తింపజేయొద్దని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ తుకారాంకు వినతిపత్రం అందచేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పించాలన్నారు. నెలకు లక్షల రూపాయలు సంపాదించే మహిళా ఉద్యోగులకు ఉచిత ప్రయాణాన్ని రద్దు చేయాలన్నారు. ఆటో నడిపే కార్మికుడికి నెలకు రూ. 3 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గసికంటి లక్ష్మణ్, కోశాధికారి ప్రవీణ్, కిరణ్, రాకేశ్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలి

ఆదిలాబాద్: రైతులు సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ కేంద్ర నిర్వాహకురాలు రేవతి బెహన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విశ్వవిద్యాలయ కేంద్రంలో రైతులను సన్మానించారు. సేంద్రీయ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం ప్రియ బెహన్ జి మాట్లాడుతూ.. రసాయనాలు అధికంగా వాడడం వలన భూసారం తగ్గిపోయి దిగుబడులు తక్కువగా వస్తున్నాయన్నారు. భూసారం పెరగాలంటే సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా విద్యార్థి సత్తా

ఆదిలాబాద్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో గురు గోవింద్ క్రీడా కళాశాలలో జరుగుతున్న 67వ ఎస్జీఎఫ్ఐ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా విద్యార్థి సత్తా చాటాడు. అండర్–14 విభాగంలో ఉట్నూర్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన రాథోడ్ విక్రమ్ 4.100 మీటర్ల రిలే పరుగు పందెం పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించాడని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు తెలిపారు. డీఈవో ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేష్, స్వామి విద్యార్థిని గురువారం అభినందనలు తెలిపారు.

అమ్మహస్తం ప్రారంభమయ్యేనా?

- గత కాంగ్రెస్ హయాంలో తొమ్మిది రకాల సరుకులు
- ప్రస్తుతం బియ్యం మాత్రమే పంపిణీ

జిల్లాలోని రేషన్‌కార్డులు	1,91,776
లబ్ధిదారులు	6,39,275


లబ్ధిదారుడి వేలిముద్ర తీసుకుంటున్న రేషన్ డీలర్ (ఫైల్)

బోథ్: రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు ఇవ్వకపోవడంతో పేదలకు భారంగా మారింది. బియ్యం మినహా ఇతర సరుకులు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మహస్తం పథకం ద్వారా తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి బియ్యంతో పాటు వంటకు అవసరమయ్యే తొమ్మిది రకాల సరుకులు తక్కువ ధరకు అందజేసింది. తెలంగాణ ఏర్పడిన తరువాత అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం పాత విధానానికి స్వస్తి పలికి ప్రత్యేకంగా ఆహార భద్రత పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా కేవలం బియ్యం, కిరోసిన్, పంచదార మాత్రమే సరఫరా చేశారు. తదనంతరం కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో ప్రజలు కొనలేకపోతున్నారు. ఇక రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తున్నా.. ఇతర నిత్యావసర వస్తువుల ధరలు భారంగా మారాయి.

బహిరంగ మార్కెట్‌లో ధరల దడ..

రేషన్ దుకాణాల్లో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర రూ.160 పలుకుతోంది. చక్కెర రూ.42 ధర ఉంది. రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో తొమ్మిది నిత్యావసర వస్తువులు..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంగా కిరణ్‌కుమార్ రెడ్డి అమ్మహస్తం పథకాన్ని రూపొందించారు. ఈపథకం ద్వారా తొమ్మిది రకాల సరుకులు అందించారు. బియ్యం, చక్కెర, చింతపండు, కందిపప్పు, గోధుమ, కారంపొడి, పసుపుతో పాటు పలు రకాల వస్తువులు అందించారు. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో అమ్మహస్తం పథకం పునరుద్ధరణపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పేద ప్రజలకు తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

సరుకులు అందించాలి



గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రకాల సరుకులు అందించింది. దీంతో చాలా మంది పేద ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు పొందారు. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. సర్కారు స్పందించి తొమ్మిది రకాల సరుకులు అందించాలి.

– మల్లెపూల విజయ్‌కుమార్, బోథ్

మళ్లీ ప్రారంభించాలి



మార్కెట్‌లో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కాబట్టి ప్రభుత్వం నిత్యావసర సరుకులను సబ్సిడీపై అందించాలి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో తొమ్మిది రకాల వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా అందించారు. ఈ ప్రభుత్వంలో కూడా సరుకులు అందించాలి.

– అవునూరి నవీన్ కుమార్, బోథ్

'ఉప రాష్ట్రపతిని కించపరచడం సరికాదు'


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: పార్లమెంట్ ప్రాంగణంలో ఉప రాష్ట్రపతిని కించపరిచే విధంగా ఇండియా కూటమికి సంబంధించిన ఎంపీలు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వీడియో తీసి కించపరచడం సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ చర్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు. భారత ఉప రాష్ట్రపతిని ఈ విధంగా వీడియోలు తీసి, కించపరిచే విధంగా ఇండియా కూటమి సభ్యులు వ్యవహరించడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరెల్లి రాజలింగు, దీపక్‌సింగ్, షేకవత్, పడ్వాల్ విజయ్‌సింగ్, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌ను అనుకరిస్తూ ఇండియా కూటమి ఎంపీలు అవహేళన చేయడం హేయమైన చర్య అని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో గురువారం నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీ ఇండియా కూటమి సభ్యుల చిత్రపటాలను తొక్కుతూ క్షమాపణలు తెలపాలని డిమాండ్ చేశారు. ఆదినాథ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమి ఎంపీలు సభ మర్యాదలను పాటించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ విజయ బోయర్, జోగు రవి, లోక ప్రవీణ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లాలా మున్నా, వేదవ్యాస్, దినేష్ మటోలియా, కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, రాజేశ్, కృష్ణయాదవ్, గొర్ల రాము పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు చేరాలి

బేల: అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలు ప్రతీ ఇంటికీ చేరాలని రాష్ట్రీయ స్వయం సేవక్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగాంబర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతల పంపిణీ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28 వరకు మండల కేంద్రానికి, ఆ వెంటనే గ్రామాలకు చేరుతాయన్నారు. జనవరి 22న అయోధ్యలో జరుగబోయే శ్రీ రాముని ప్రాణ ప్రతిష్ఠ రోజున పూజాది కార్యక్రమాలు చేసి, అక్షింతలు తమ తలపై వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ జిల్లా ప్రచారక్ కొమురయ్య, జైనథ్ ఖండ కార్యవాహ గుండవార్ శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు బెదుర్‌కార్ ప్రఫుల్, ఉప్పల నారాయణ, రాము, మనోజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ శుక్రవారం పలు మండలాల్లో పర్యటించనున్నట్లు నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ మండలంలోని బుద్దికొండ శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవంలో, గుడిహత్నూర్ మండలంలోని డొంగర్‌గావ్‌లో ఇల్లు దగ్ధమైన బాధితులను, అనంతరం ఇచ్చోడలోని క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి


చెక్కు అందజేస్తున్న మేనేజర్

ఉట్నూర్‌రూరల్: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకటరామి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హస్నాపూర్ గ్రామీణ బ్యాంకు ద్వారా 25 స్వయం సహాయ మహిళా సంఘాలకు కోటి రూపాయల చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలు స్వయం ఉపాధిలో రాణించేందుకు గ్రామీణ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాల ద్వారా వ్యాపారాలు చేసుకొని ఎదగాలన్నారు. ప్రైవేట్ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, బ్యాంకు మేనేజర్ రాజేశ్, శ్రీనివాస్ ఆర్ఎం పూర్ణచందర్, డీఆర్డీపీ ఏపీడీ చరణ్ దాస్, జాదవ్ శేషరావు, ఐకేపీ ఏపీఎం సూర్యకాంత్, సీసీలు రాజేశ్వర్, పద్మరావు, విఠల్‌రావు, అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

శనగ రైతులు సూచనలు పాటించాలి


సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి విశ్వామిత్ర

బోథ్: శనగ రైతులు వ్యవసాయాధికారులు సూచనలు పాటించాలని బోథ్ మండల వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర అన్నారు. గురువారం సొనాలలో శనగ రైతులకు పలు సూచనలు చేశారు. ఎండు తెగులు, వేరు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున ట్రికోడర్మా మందుతో విత్తనం వేసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ప్రతీ సంవత్సరం శనగ పంటలో ఎండు తెగులు ఆశించి పంట ఎండినట్లు అయితే పంట మార్పిడి చేయాలన్నారు. వేరుకుళ్లు తెగులు ఉంటే 200 లీటర్ల నీటిలో 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో పాటు 20 గ్రాముల ప్లాంటామైసిన్ వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వాజీద్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ పరిధిలోని పొల్లుగూడ గ్రామానికి చెందిన కోరెంగా శంభు పటేల్ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం గుండెపోటుకు గురికాగా.. 108లో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ

తలమడుగు: సామాజిక సేవలో యువత ముందుండాలని బ్లూ ఫీం యూత్ అధ్యక్షుడు గొంటి ముక్కుల ప్రేమేందర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత ఎక్కువ ఉండడంతో గురువారం మండల కేంద్రంలో నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ప్రశాంత్, అశోక్, రాజు, మైనార్టీ నాయకులు వశీం, రవికాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సురేందర్, రాథోడ్ రాజశేఖర్, రాథోడ్ నకుల్, రాథోడ్ పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మెట్లపూజ

ఇచ్చోడ: మండల కేంద్రంలో విఠలేశ్వర మందిరంలో గురువారం అయ్యప్ప మెట్లపూజ నిర్వహించారు. దాదాపుగా మూడు గంటల పాటు శాస్త్రోయుక్తంగా మెట్లపూజ చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భక్తిపాటలు పాడుతూ.. నృత్యం చేశారు. అనంతరం మహాబిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాంజాదవ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

బోథ్: నీటిపారుదల శాఖలో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ పొందిన భగవంతురావు తాను రాసిన 1008 సూక్తులు, ప్రభోదములతో కూడిన పుస్తకాన్ని గురువారం బోథ్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కత్తూరి జ్యోతి రమేశ్, రాయిపెల్లి మధూకర్, ఎలుక రాజు, ఓటస్కర్ శేఖర్, పడిగెల విజయ్ కుమార్, రాయిపెల్లి సంతోష్ పాల్గొన్నారు.

బోథ్: తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన సభ్యులు ఆదివాసీ గ్రామాలైన పార్డి(కె), గొల్లాపూర్ గ్రామాల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు తుల అజయ్ కుమార్, మెస్రం భూమన్న, నాగోరావ్, గంగాధర్, భీంరావ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 61 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ జాదవ్ కైలాస్, సుభాష్, ఏఎన్ఎం విజయలక్ష్మి ఉన్నారు.

రోడ్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి


ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాంసి: భీంపూర్ మండల కేంద్రం మీదుగా ఉన్న అంతరాష్ట్ర రోడ్డు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్‌ను కోరారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి గజేందర్‌ను అంతర్గాం, గొముత్రి గ్రామాలకు చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. ఇందులో నాయకులు గంగారెడ్డి, నరేశ్ యాదవ్, మోహన్, కిసాన్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సృజన టెక్నికల్ ఫెస్టివల్


ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సృజన టెక్నికల్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. సాంకేతిక ప్రదర్శనలో ఎలక్ట్రికల్, కంప్యూటర్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లమా విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. బెల్లంపల్లి, నిర్మల్, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు తమ తమ ప్రాజెక్టుల విశిష్టతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆదిలాబాద్ బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బి.విగ్నేశ్వర్, తలమడుగు ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి.సతీష్ కుమార్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వీరస్వామి, విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, క్రాంతి కుమార్, రాజన్న, సుజయ్, సురేశ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలి


అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో ధైర్యంగా ముందుకెళ్లాలని, ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు కౌన్సిలర్ లావణ్య సూచించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆశ్రమ పాఠశాల, గాయిత్రి పారామెడికల్ కళాశాల, కేజీబీవీ పాఠశాల్లో మహిళా సాధికారత, బేటీ బచావో.. బేటీ పడావో, సఖీ సేవలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్ క్రైం, గృహహింసం చట్టం, మిషన్ శక్తి గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, పీవీటీజీ కో ఆర్డినేటర్ సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదిదతరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉచిత విద్యుత్ బిల్లులు

- జిల్లాలో రూ.76.73 లక్షలు బకాయి
- ఆందోళనలో నాయీబ్రాహ్మణ, రజకులు
- సకాలంలో చెల్లించాలని కోరుతున్న లబ్ధిదారులు


హెయిర్ కట్టింగ్ చేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: నాయీబ్రాహ్మణ (హెయిర్ కట్టింగ్), రజకులకు (ల్యాండ్రి షాపులు) అండగా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల కిందట ఒక్కొక్క దుకాణానికి 250 విద్యుత్ యూనిట్లను ఉచితంగా ఇస్తోంది. అందులో భాగంగానే జిల్లాలో 1,578 మంది అర్హులుగా గుర్తించి వారికి ఈపథకాన్ని వర్తింప చేస్తున్నారు. అయితే ప్రారంభంలో విద్యుత్ సబ్సిడీల పథకం బాగానే కొనసాగింది. గత ఎనిమిది నెలలుగా వీటికి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 1,578 కనెక్షన్‌లు..

జిల్లాలో నాయీబ్రాహ్మణ 586 వినియోగదారులు, రజకులు 992 మంది వినియోగదారులు 250 ఉచిత విద్యుత్ పథకానికి దరఖాస్తులు చేసుకోని ప్రస్తుతం ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. వీటికి సంబంధించిన నిధులను గత మార్చిలో విడుదల చేశారు. అప్పటి నుంచి వీటికి సంబంధించిన నిధులు విడుదల కాలేదు. దీంతో నాయీబ్రాహ్మణులకు సంబంధించి రూ. 21.37 లక్షలు, ల్యాండ్రి షాపులకు సంబంధించి రూ. 55.27 లక్షలు బకాయిలు ఉన్నట్లు అధికారుల పేర్కొంటున్నారు.

ఆందోళనలో కులవృత్తిదారులు..

ఉచిత విద్యుత్ బకాయిలను ఎనిమిది నెలలుగా విడుదల చేయకపోవడంతో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుందని ఆయా కుల వృత్తులకు వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో ఉచిత విద్యుత్‌కు సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో వేలాది రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒక్కొక్కరి దుకాణం విద్యుత్ బకాయిలు రూ. 20వేల నుంచి రూ. 30వేలకు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో చెల్లించాలి



ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు సంబంధించిన ఉచిత విద్యుత్‌కు సంబంధించిన నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. విద్యుత్ బకాయిలు చెల్లించాలని సంబంధిత అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నూతనంగా ఏర్పాటైనా కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి సంబంధించిన నిధులను విడుదల చేసి తమకు అండగా ఉండాలి.

– మందపల్లి శ్రీనివాస్, నాయీబ్రాహ్మణుడు

బకాయి పెరిగిపోతోంది



ఆదిలాబాద్ పట్టణంలో కట్టింగ్ షాప్‌ను కొనసాగిస్తున్నా. ప్రభుత్వం కట్టింగ్ షాపులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గత కొన్ని నెలలుగా వాటికి సంబంధించిన నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం పేరుకుపోయిన బకాయిలతో ఆందోళన చెందుతున్నాం.

– అశోక్, ఆదిలాబాద్

చలి నుంచి పశువులకు రక్షణ



తాంసి: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. ఈక్రమంలో చలిని తట్టుకునేందుకు ప్రజలు ప్రత్యామ్నాయంగా ఉన్నిదుస్తులు ధరించి, చలి మంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. కాగా పశువులు, జంతువులు సైతం చలికి అల్లాడుతున్నాయి. భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన భూమయ్య అనే రైతు తన పశువులకు ప్రత్యేకంగా గోనె సంచులను తయారు చేయించి పశువులపై కప్పుడుతున్నాడు.